కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

శ్రీ ఆదిశంకరాచార్య విరచిత

భజగోవిందం

- భావార్థముతో -

శ్రీరస్తు

శుభమస్తు





సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



Kiron Type Institute

Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

పూర్వాపరాలు

పూర్వము శంకరాచార్యులవారు శిష్యసమేతముగా కాశీపట్టణమున గంగాస్నానమునకై పోవుచుండ త్రోవలో నొక వృద్ధ విప్రుడు వ్యాకరణ సూత్రములు వల్లించుచుండగా, అతని నుద్ధరింపదలంచి ఈ భజగోవింద శ్లోకములను అతనికి చెప్పిరి.

తదుపరి శంకరుల శిష్యులుకూడ కొన్ని శ్లోకములను చెప్పిరి. మహోన్నత భావములతో గూడిన ఆ వాక్యములను విని విప్రుడాప్రకారమే ఆచరించి తరించెను. ఈ ప్రపంచమున గల ధనధాన్యాది సంపదలుకాని, లౌకిక విద్యలుకాని అంత్య కాలమున జీవుని రక్షించలేవు. భగవద్భక్తి, ఆత్మజ్ఞానము మాత్రమే అతనిని కాపాడగలవు. కావున సమయమును వ్యర్థము చేయక భగవంతుని భజించుట శ్రేయస్కరము.

ప్రాపంచిక వస్తువులగు ధనాదులను గూర్చిన ఆశ ఆధ్యాత్మిక పురోగమనమునకు చాలా ప్రతిబంధకమైనది. కావున ముముక్షువులు దానిని త్యజించవలెను. ఉన్నదానితో, లేక లభించిన దానితో తృప్తిపడవలెను. ఆశకొలది లక్షలు ఆర్జించినను, కోటికిపడగలెత్తినను ఒక్క చిల్లిగవ్వ అయినను అంత్యకాలమున వెంటరాదు. పైగా దానిని సంపాదించుటలో అవలంబించు వక్రమార్గములచే పాపమును మూటకట్టుకొనవలసి వచ్చును. భగవద్ధ్యానమునకు సమయమున్ను మిగులదు. కాబట్టి ధనాదుల తృష్ణను విడనాడి లభించినదానితో తృప్తినొంది యుండుట ఉత్తమము.

మొదటి 12 శ్లోకములను శ్రీ శంకరులు బోధించిరి. కావున ఇది ద్వాదశమంజరికా స్తోత్రమని విఖ్యాతి గాంచినది.ఈ శ్లోకములకు మోహముద్గర మనియు పేరు కలదు.ముద్గర మనగా సమ్మెట. మోహమనగా అజ్ఞానము. జనుల అజ్ఞానమును నిర్మూలించుటకు ఈ బోధ సమ్మెట దెబ్బవలె పనిచేయునని భావము.

14వ శ్లోకమునుండి 25వ శ్లోకము వరకు, 27, 28 శ్లోకములు శంకరాచార్యులవారి శిష్యులు చెప్పగా 26వ శ్లోకము, 29 నుండి 32వ శ్లోకము వరకు తిరిగి శ్రీ శంకరాచార్యులవారే బోధించిరి.

ఈ ప్రకారముగా శ్రీ శంకరాచార్యులవారు, వారి శిష్యవర్గము చేసిన ఆధ్యాత్మిక బోధలను ఆ వ్యాకరణ విద్వాంసుడు శ్రవణము చేసి, అంతఃకరణమును శుద్ధిపఱచుకొని తరించెను.

సంసార బంధ విముక్తిని బడయుటకు గురుబోధ పరమావశ్యకమైయున్నది.

కనుక అనుభవజ్ఞుడగు సద్గురువును ఆశ్రయించి ఆత్మానాత్మ వివేకము బడసి, తరించు మార్గమును తెలిసికొని, ఆ ప్రకారమాచరించి ఆత్మశాంతిని, ఆత్మానుభవమును పొంది, పవిత్రమైన మానవ జీవితమును సఫలమొనర్చుకొనవలెను.

// హరిః ఓం తత్ సత్ //

- - - = = = - - -

Kiron Type Institute

శ్రీ ఆదిశంకరాచార్య విరచిత " భజగోవిందం "

01. భజ గోవిందం(గోవిన్దం) భజ గోవిందం(గోవిన్దం)
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్కరణే॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

గోవిందుని సేవించుము. గోవిందుని సేవించుము. ఓ మూఢమానవుడా! గోవిందుని సేవించుము. మరణము సమీపించునప్పుడు "డుకృఞ్కరణే" అను వ్యాకరణ సూత్రము నిన్ను రక్షించదు.

ఓయీ! వృద్ధుడా! మరణకాలము సమీపించగా నీవు వల్లించు "డుకృఞ్ కరణే" అను వ్యాకరణ సూత్రము నిన్ను రక్షింపజాలదు. కావున గోవిందుని మరల మరల భజించుము. బుద్ధిమంతుడవై మెలుగుము.

02. మూఢ జహీహి ధనాగమతృష్ణాం
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్।
యల్లభసే నిజ కర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ఓ మూర్ఖుడా! ధనసంపాదనపై ఆశవదులుము. వైరాగ్యభావనను మనసుతో నింపుకొనుము. స్వశక్తిచే సంపాదించిన ధనముతో ఆనందించుము.

ధనమును సంపాదించుటయందలి ఆశను వదలుము. ఆశారహితమగు సద్బుద్ధిని మనంబున కలుగజేసి కొనుము. నీ పూర్వకర్మ ఫలితముగ ఎంత ధనము నీకు లభించునో దానితోనే తృప్తినొంది యుండుము. అజ్ఞానమును పారద్రోలుము.

03. నారీస్తనభర నాభీదేశం
దృష్ట్వా మా గా మోహావేశమ్।
ఏతన్మాంసవ సాది వికారం
మనసి విచాంతయ(విచిన్తయ(యా)) వారం వారమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

యువతుల స్తనములను నాభిని చూచి మోహావేశం పొందకుము. అవన్నీ మాంసపు ముద్దలే అని మరల మరల మనసుతో తలచుము.

స్త్రీలయొక్క స్తనములను, నాభి ప్రదేశమును చూచి మోహమును పొందకుము. అవి మాంసము, క్రొవ్వు మొదలగు పదార్థములయొక్క వికారరూపములేయని మనస్సునందు మాటి మాటికి చింతన చేయుము.

04. నలినీదలగత జలమతి తరళం
తద్వజ్జీవిత మతిశయ చపలమ్।
విద్ధి వ్యాధ్యభి మాన గ్రస్తం
లోకం శోకహతం చ సమస్తమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

తామరాకుపై నీటిబొట్టువలే జీవితము మిక్కిలి చంచలమైనది. లోకమంతా వ్యాధులతో దురభిమానముతో నిండి శోకించుచున్నదని తెలుసుకొనుము.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

తామరాకుపై పడిన నీరు ఎట్లు చపలముగ నుండునో, అట్లే ప్రాణికోట్లయొక్క జీవితము మహాచపల మైనది. ప్రపంచమున జనులు రోగములు, అభిమానము మున్నగు వానితో గూడినవారై దుఃఖముతో సతమత మగుచున్నారు.

05. యావద్విత్తో(యావద్-విత్తో) పార్జన సక్తః
స్తా(తా)వన్నిజ పరివారో రక్తః।
పశ్చాజ్జీవతి జర్జర దేహే
వార్తాం కోఽపి న (ర) పృచ్ఛతి దే(గే)హే॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ధనము సంపాదించినంతవరకే తన వారు ప్రేమ చూపుదురు. శరీరము కృశించినప్పుడు ఇంటిలో ఎవడూ నీ విషయమడుగడు.

మానవుడు ఎంతవఱకు ధనమును సంపాదింప గలిగియుండునో, అంతవఱకు అతని కుటుంబమువారు, బంధువులు అతనిపై ప్రేమ గలిగియుందురు. తదుపరి వార్ధక్యము దాపురించుటవలన ధనార్జనయందు శక్తి లేనివాడగుటచే అత్తఱి ఎవడును అతని వృత్తాంతమును గూర్చి విచారింపడు.

06. యావత్పవనో నివసతి దేహే
తావత్పృచ్ఛతి కుశలం దే(గే)హే।
గతవతి వాయో(యౌ) దేహాపాయే
భార్యా బిభ్యతి తస్మిన్కాయే॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

శరీరంలో ప్రాణమున్నంతవరకే కుశలమడుగుదురు. ప్రాణములు పోయిన పిదప ఆ శవమును చూచి భార్య కూడ భయపడును.

ఎంతవఱకు దేహమందు ప్రాణవాయువు ఉండునో, అంతవరకు అందఱును అతని క్షేమసమాచారములను గూర్చి ప్రశ్నించుచుందురు. ఆ కొంచెము ప్రాణము లేచిపోయినప్పుడు ఆ మృతదేహమును గాంచి భార్యకూడ భయపడును. అత్తఱి ఎవరును దగ్గఱకు చేరరు.

07. బాలస్తావ క్రీడాన(స)క్తః
తరుణస్తావ త్తరుణీస(న)క్తః।
వృద్ధస్తావ చింతాన(స)క్తః(చింతామగ్నః)
పరే(పరమే) బ్రహ్మణి కోఽపి న (లగ్నః)సక్తః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

బాలుడు ఆటలపై మనస్సు పెట్టును. యువకుడు యువతిపై మనస్సు పెట్టును. పరబ్రహ్మపై ఎవడూ మనస్సు పెట్టడు.

మనుజునకు బాల్యకాలము ఆటలయందు గడచి పోవుచున్నది. యౌవనము వనితాది విషయములందు గడచుచున్నది. వార్ధక్యమో అనేక చింతలతో గడిచి పోవు చున్నది. ఇక పరబ్రహ్మమునందు ఆసక్తికలవాడెవడును లేడు. (అట్టివాడు అరుదని భావము)

08. కా తే కాన్తా కస్తే పుత్రః
సంసారోఽయమ తీవ విచిత్రః।
కస్య త్వం (కః కుత ఆయాతః)వా కుతః యాతః
తత్త్వం చింతయ తదిహ భ్రాతః(భ్రాన్తః)॥

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

నీ భార్య ఎవరు? నీ పుత్రుడు ఎవరు? ఈ సంసారం చాలా విచిత్రమైనది. నీవెవడివాడవు? ఎవడవు? ఎక్కడ నుండి వచ్చావు? ఓ సోదరుడా! తత్వము నాలోచించుము.

నీ భార్య ఎవరు? కొడుకు ఎవరు? వారికి నీకు ఏమి సంబంధము? ఈ సంసారము చాలా విచిత్రముగ నున్నది. సోదరా! నీవు ఎవరివాడవు? ఎచటనుండి వచ్చినావు? దీని తత్త్వమును బాగుగా విచారించి తెలిసికొనుము.

09. సత్సంగత్వే(సత్సఙ్గత్వే) నిస్సంగత్వం(నిస్సఙ్గత్వం)
నిస్సంగత్వే(నిస్సఙ్గత్వే) నిర్మోహత్వమ్।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

సత్పురుష సాంగత్యము వలన భవబంధములు తొలగును. బంధములు తొలగినచో మోహము నశించును. మోహము నశించగా స్థిరమైన జ్ఞానమేర్పడును. స్థిరజ్ఞానమేర్పడగా జీవన్ముక్తి కలుగును.

సజ్జన సాంగత్యముచే సంసారమందు నిస్సంగత్వము కలుగును. నిస్సంగత్వముచే మోహము (అజ్ఞానము) అంతరించును. మోహము అంతరించుటచే ఆత్మతత్త్వమందు నిలకడ కలుగును. అట్టి నిశ్చల తత్త్వముచే జీవన్ముక్తి లభించును.

10. వయసి గతే కః కామవికారః
శుష్కే నీరే కః కాసారః।

క్షీణే విత్తే కః పరివారః(రో)

జ్ఞాతే తత్త్వే కః సంసారః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

వయస్సు మళ్ళినచో కామవికారమెక్కడ? నీరెండి పోవగా చెరువెక్కడ? సంపద క్షీణించినచో బంధువులెక్కడ? తత్త్వజ్ఞానమేర్పడగా సంసారమెక్కడ?

యౌవనము గడచిన పిమ్మట కామ వికారమెచట? నీరు ఎండిపోవ ఇక చెఱువు ఎచట? ధనము తగ్గిపోగా ఇక పరిజన మెచట? తత్త్వజ్ఞానము కలిగిన పిమ్మట (అత్మ తత్త్వము తెలిసికొనిన మీదట) ఇక సంసారబంధ మెచట? (అవి ఉండవని భావము)

11. మా కురు ధన జన యౌవన గర్వం
హరతి నిమేషాత్కాలః సర్వమ్।
మాయామయమిదం అఖిలం (బుధ్వా)హిత్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ధనము - జనము - యౌవనము చూచి గర్వపడకుము. వీటన్నిటినీ కాలము ఒక్క క్షణములో హరించును. మాయా మయమైన ఈ ప్రపంచమును విడచి జ్ఞానివై బ్రహ్మపదము పొందుము.

ధనము, పరివారము, యౌవనము - ఇవి కలవని గర్వించకుము. ఏలయనిన, ఒక్క నిమిషములో కాలము వాని నన్నింటిని హరించివేయగలదు. దృశ్యపదార్థము లన్నియు మాయమయములున, అశాశ్వతములు. కావున వాటిని త్యజించి, శాశ్వతమగు బ్రహ్మమును తెలిసికొని అందు ప్రవేశించుము. (బ్రహ్మైక్యమును బడయుము)

12. దిన యామిన్యౌ సాయం ప్రాతః
శిశిర వసన్తౌ పునరాయాతః।
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః
తదపి న ముంచ(ముఞ్చ)త్యాశావాయుః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

పగలు - రాత్రి, సాయంకాలము - ప్రాతఃకాలము, శిశిర ఋతువు - వసంత ఋతువు, ఇవన్నీ మళ్లీ మళ్లీవచ్చును. కాలము ఆటలాడుచున్నది. ఆయుష్షు క్షీణించుచున్నది. అయినా ఆశ విడువకున్నది.

పగళ్ళు, రాత్రి గడచిపోవుచున్నవి. సాయంకాల ప్రాతః కాలములు వచ్చుచు పోవు చున్నవి. శిశిర ఋతువులు, వసంత ఋతువులు ఎన్నియో గడచి పోవుచున్నవి. ఈ ప్రకారముగ కాలచక్రము రివ్వున తిరుగుచున్నది. ఆయుష్షు తరిగిపోవుచున్నది. ఆయినను ఆశ యను గాలి జనులను వదలకయే యున్నది.

– – –

13. ద్వాదశ మఞ్జరికాభిరశేషః
కథితో వైయాకరణస్యైషః।
ఉపదేశోఽ భూద్విద్యానిపుణైః
శ్రీమచ్ఛఙ్కరభగవచ్ఛరణైః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

“పండ్రెండు శ్లోకములను” పుష్పగుచ్ఛములతో కూడిన ఈ సమస్త శాస్త్రసార భూతమగు ఉపదేశ మంతయు సకల విద్యా ప్రవీణులైనట్టి శ్రీ శంకరాచార్యులవారిచే వ్యాకరణ పండితునకు చెప్పబడెను.

– – –

14. కా తే కాంతా ధనగతచిన్తా
వాతుల కిం తవ నాస్తి నియన్తా।
త్రిజగతి సజ్జనసంగతిరేకా
భవతి భవార్ణవ తరణే నౌకా॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ఓ మూర్ఖుడా! నీకు కాంత – ధనములపై చింత ఎందుకు? నిన్ను శాసించువాడు లేడా ఏమి? మూడులోకములలోనూ, సత్పురుష సాంగత్యమొక్కటే సంసార సముద్రమును దాటించు నౌక.

ఓయీ! నీకు యువతీ, ధనాదుల గూర్చిన చింత ఏల? నీకు బోధించువాడు నిన్ను శాసించువాడు లేడా ఏమి? ముల్లోకములందును ఒక్క సజ్జన సహవాసమే సంసార సముద్రమును దాటుటకు నావయై యున్నది.

ఈ శ్లోకమును శ్రీ పద్మపాదాచార్యులవారు చెప్పిరి.

15. జటిలో ముండీ లుంఛి(జి)త కేశః
కాషాయాంబర బహుకృతవేషః।
పశ్యన్నపి చ న పశ్యతి మూ(ఢః)ఢో
హ్యుదర(ఉదర)నిమిత్తం బహుకృత వేషః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

జడలు ధరించినవాడై – గుండు కొట్టించుకున్నవాడై – జుట్టు కత్తిరించు కున్నవాడై – కాషాయ వస్త్రములు ధరించిన వాడై పొట్టనింపుకొనుటకు వివిధ వేషములు ధరించు మూర్ఖుడు చూస్తూ కూడ చూడనట్లుండును.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

అజ్ఞాని జడలు పెంచుకొనినను, బోడితల కలవాడైనను, రకరకములుగా జుట్టు కత్తిరించుకొనినను, కాషాయ వస్త్రము ధరించినను, పలు విధములుగా వేషములు వేసినను, బ్రహ్మమయమగు ఈ జగత్తును చూచుచున్నను, పరమార్ధ సత్యమును తెలిసికొనకయే యున్నాడు. అత్తటి అతడు పలు రకములుగ వేయు వేషములన్నియు పొట్టకూటికొఱకు మాత్రమే యగునుగాక!

ఈ శ్లోకమును తోటకాచార్యులవారు చెప్పిరి.

16. అంగం గలితం ఫలితం ముండం
దశన విహీనం జాతం తుండమ్।
వృద్ధో యాతి గృహిత్వా దండం
తదపి న ముంచత్యాశా పిండమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

శరీరం క్షీణించినది. దంతములు ఊడినవి. ముసలివాడై కర్రపట్టుకుని నడచుచున్నాడు. అయినా ఆశ వదలుటలేదు.

శరీరము ముడులతు పడినను, తల నెరసిపోయినను, పండ్లు ఊడిపోయినను, కఱ్ఱపట్టుకొని నడుచుచున్నను ముసలివానికి ఆశవదలుటలేదు.

ఈ శ్లోకమును హస్తామలకాచార్యులవారు చెప్పిరి.

17. అగ్రే వహ్నిః పృష్ఠేభానూ(నుః)
రాత్రౌ చుబుక సమర్పిత జానుః।
కరతల భిక్షస్తరుతల వాసః
తదపి న ముంచత్యాశాపాశః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ముందు అగ్నిని వెనుక సూర్యుని ఉంచుకొని చలికాచు కొనుచూ, రాత్రులలో మోకాలుపై గడ్డము నుంచి, చేతులతో భిక్షస్వీకరించుచూ, చెట్టు కింద నివసించు వానిని కూడ ఆశాపాశం వదలుటలేదు.

ముందుభాగమున అగ్నిహోత్రము, వెనుక భాగమున సూర్యుడు కలిగియుండి, రాత్రిళ్ళు చలిపోగొట్టు కొనుటకొఱకై మోకాళ్ళు గడ్డమునకు ఆనించి ముడుచుకొని పరుండుచు, కరతలభిక్షను స్వీకరించుచు, చెట్టుక్రింద నివసించుచు ఉన్నప్పటికిని ఆశ యను త్రాటిని వదలుటలేదు.

ఈ శ్లోకమును సుబోధాచార్యులవారు చెప్పిరి.

18. కురుతే గంగా సాగర గమనం
వ్రత పరిపాలనమథవా దానమ్।
జ్ఞాన విహీనః సర్వమతేన
ముక్తిం న భజతి జన్మశతేన॥
(భజతి న ముక్తిం జన్మ శతేన)

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

గంగా - సముద్ర సంగమములో స్నానం చేసినా, వ్రతముల నాచరించినా, దానం చేసినా కూడా తత్వజ్ఞానం లేనివాడు వంద జన్మలకైనా ముక్తి పొందడు.

గంగాది పవిత్ర నదులందును, సముద్రమందును స్నానమాచరించినప్పటికినీ, వ్రతములను ఆచరించి నప్పటికినీ, దానములను చేసినప్పటికినీ ఆత్మజ్ఞానము లేనిచో నూఱు జన్మలకైనను మనుజునకు మోక్షము లభించదు. ఇది సర్వమత సమ్మతము.

ఈ శ్లోకమును సురేశ్వరాచార్యులవారు చెప్పిరి.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

19. సుర మందిర తరు మూల నివాసః
శయ్యా భూతలమజినం వాసః।
సర్వ పరిగ్రహ భోగ త్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

గుడిలో చెట్టుకింద నివాసము, నేలపై నిద్ర, తోలును వస్త్రంగా ధరించుట, దేనినీ స్వీకరించకపోవుట, భోగము ననుభవించక పోవుట, అను వైరాగ్యము ఎవడికి సుఖమివ్వదు?

దేవాలయ ప్రాంగణమునగల చెట్టుక్రింద నివాసము చేయుచు, భూమినే శయ్యగా ఉపయోగించు కొనుచు, జింకచర్మమునే వస్త్రముగా ధరించుచు, సర్వ వస్తు పరిగ్రహణమును త్యజించి, భోగములను వదలివైచి, వైరాగ్యమును అవలంబించి భగవంతుని ధ్యానించుచుండ ఎవనికి సుఖము కలుగకుండును?

ఈ శ్లోకమును నిత్యానందాచార్యులవారు చెప్పిరి.

20. యోగరతో వా భోగరతో వా
సం(గ)ఘరతో వా సం(గ)ఘవిహీనః।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం
నందతి నందతి నందత్యేవ॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

యోగము నాచరించువాడు కానీ - సుఖముల ననుభవించువాడు కానీ, బంధములు పెంచుకొనువాడు కానీ - తెంచుకొనువాడు కాని, ఎవడి మనస్సు పరబ్రహ్మయందు లగ్నమగునో వాడు ఆనందించుచునే ఉండును.

Kiron Type Institute
Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

ఎవనియొక్క చిత్తము పరబ్రహ్మమునందు (ఆత్మయందు) నిలకడకలిగియుండునో అట్టివాడు యోగయుక్తుడుగ నుండినను, భోగయుక్తుడుగనుండినను, సంగయుక్తుడుగ నుండినను, సంగరహితుడుగనుండినను, ఆనందమునే మువ్మాటికిని పొందుచుండును.

ఈ శ్లోకమును ఆనన్దగిరి ఆచార్యులవారు చెప్పిరి.

21. భగవద్గీతా కించిదధీతా
గంగా జలలవ కణికా పీతా।
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమేన న(స) చర్చా॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

కొంచెమైనా భగవద్గీత చదివి, ఒక క్షణమైనా గంగా జలం త్రాగి, ఒక్కసారైనా విష్ణువును పూజించిన వానిని యముడేమి చేయగలడు?

ఎవడు భగవద్గీతను కొంచెమైనను అధ్యయనము చేయునో, గంగాజలమును ఒకింతైనను పానమో చేయునో, ఒక్క పర్యాయమైనను భగవంతుని పూజించునో, అట్టి వానిని గూర్చి యముడు కూడ చర్చింపడు.

ఈ శ్లోకమును దృఢభక్తాచార్యులవారు చెప్పిరి.

22. పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనమ్।
ఇహ సంసారే బహు దుస్తారే
కృపయాఽపారే పాహి మురారే॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

Kiron Type Institute

మరల పుట్టుక మరల మరణము మరల తల్లి గర్భంలో నివాసము అను దాటలేని అపారమైన సముద్రం నుండి ఓ కృష్ణా! దయతో రక్షింపుము.

మరల మరల పుట్టుట, మరల మరల చచ్చుట, మరల మరల తల్లి గర్భమునందు పరుండుట - మున్నగు బాధలతో కూడిన ఈ అపార దుస్తర సంసార సముద్రము నుండి ఓ పరమాత్మా! దయతో రక్షింపుము!

ఈ శ్లోకమును నిత్యనాథాచార్యులవారు చెప్పిరి.

23. రథ్యా క(చ)ర్పట విరచిత కన్థః
పుణ్యా పుణ్య వివర్జిత పన్థః।
యోగీ యోగ నియోజిత (చిత్తః)చిత్తో
రమతే బాలోన్మత్తవదేవ॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

కూడలిలో దొరికిన పీలికగుడ్డలను కట్టుకుని, పాపపుణ్యము లంటని కర్మల నాచరించుచూ, యోగముచే చిత్తవృత్తులను నిరోధించు యోగి, బాలుని వలే ఉన్మత్తుని వలే ఆనందించుచుండును.

వీథులయందు పడియున్న గుడ్డప్రేలికలచే సమకూర్చబడిన బొంతకలవాడును, పుణ్యాపుణ్యములకు అతీతమైన ఆత్మ మార్గమున సంచరించువాడును, ఆత్మయందు నియోగింపబడిన చిత్తము కలవాడును అగు యోగి బాలునివలెను, ఉన్మత్తునివలెను తనలో తాను ఆనందించు చుండు. (ఆత్మానందమును బడయు చుండును)

ఈ శ్లోకమును యోగానందాచార్యులవారు చెప్పిరి.

24. కస్త్వం కోఽహం కుత ఆయాతః
కా మే జననీ కో మే తాతః।

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

ఇతి పరిభావయ (నిజ సంసారం)సర్వమసారం
(సర్వం)విశ్వం త్యక్త్వా స్వప్న విచారం॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

నీ వెవరు? నే నెవరు? ఎక్కడ నుండి వచ్చావు? నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? స్వప్నమువలే ఈ ప్రపంచమును విడచి అంతా నిస్సారమే అని భావించుము.

నీ వెవడవు? నే నెవరిని? మన మెచటినుండి వచ్చితిమి? నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? – అని ఈ ప్రకారముగ సంసారమును గూర్చి విచారించి, ఇది యంతయు స్వప్నమువలె అసత్యమని యెఱిగి ఆ యా దేహాది పదార్థములపై వ్యామోహమును విడనాడి సత్యమగు పరమాత్మ నాశ్రయించవలెను.

ఈ శ్లోకమును సురేంద్రాచార్యులవారు చెప్పిరి.

25. త్వయి మయి చాన్య(సర్వ)త్రైకో విష్ణుః
వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః।
భవ సమచిత్తః సర్వత్ర త్వం
వాంఛస్యచిరాద్య(ద్న)గది విష్ణుత్వం॥
(సర్వస్మిన్నపి పశ్యా త్మానం
సర్వత్రో త్సృజ భేద జ్ఞానమ్॥)

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

నీలో, నాలో, వేరేచోట ఉన్నది పరమాత్మ ఒక్కడే. అసహనంతో నాపై వ్యర్థంగా కోపించుచున్నావు. అంతటా పరమాత్మనే చూడుము. విభేదమును విడువుము.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

నీయందు, నాయందు, అంతటను ఒకే భగవంతుడు వ్యాపించియున్నాడు. 17
అయినను నా యెడల అసహనము కలిగి వ్యర్థముగ నన్ను కోపగించుచున్నావు. నీవు దైవత్వమును శీఘ్రముగా వాంఛించెదవేని సర్వత్ర సమబుద్ధి కలవాడవు (సర్వం విష్ణు మయం అను భావము కలవాడవు) కమ్ము.

ఈ శ్లోకమును మేధాతిథి ఆచార్యులవారు చెప్పిరి.

26. శత్రౌ మిత్రే పుత్రే బంధౌ
మా కురు యత్నం విగ్రహసంధౌ।
(భవ సమచిత్తః సర్వత్ర త్వం
వాంఛస్య చిరా ద్య(ద్స)ది విష్ణుత్వమ్॥)
సర్వస్మిన్నపి పశ్యాత్మానం
సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

శ్రీఘ్రంగా పరమాత్మను పొందదలచినచో శత్రు - మిత్ర - పుత్ర - బంధువుల పట్ల విరోధ స్నేహములకై ప్రయత్నించక సర్వసమాన భావమును పొందుము.

శత్రువుతోగాని, మిత్రునితోగాని, పుత్రునితోగాని, బంధుబులతో గాని కలహాదులకు ప్రయత్నించకుము. అందటియందును ఆత్మనే వీక్షింపుము. భేదరూపమైన అజ్ఞానమును సర్వత్ర త్యజించి వేయుము.

ఈ శ్లోకమును శ్రీ శంకరాచార్యులవారు చెప్పిరి.

27. కామం క్రోధం లోభం మోహం
త్యక్త్వాఽఽ త్మానం (పశ్యతి సోఽ హం)భావయ కోఽహమ్।

ఆత్మజ్ఞానవిహీనా మూఢాః
స్తేపచ్యన్తే(తే పచ్యన్తే) నరకనిగూఢాః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

కామ – క్రోధ – లోభ – మోహములను వదలి నిన్ను నువ్వు తెలుసుకో. ఆత్మజ్ఞానం లేని మూఢులు నరకంలో పడి పీడింపబడెదరు.

కామమును, క్రోధమును, లోభమును, మోహమును విడిచినచో, అనగా మనస్సునందలి వికారములను త్యజించినచో జీవుడు " సోఽహం " భావము ద్వారా అనగా " ఆ పరమాత్మయే నేను " అను నిశ్చయముద్వారా తన ఆత్మను చూడగలుగు చున్నాడు. అటి ఆత్మజ్ఞానములేని వారు అజ్ఞానులు, నరకమునబడి నానాబాధలు నొందుదురు.

ఈ శ్లోకమును భారతీవంశాచార్యులవారు చెప్పిరి.

28. గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్।
నేయం సజ్జన సంగే చిత్తం
దేయం దీనజనాయ చ(తు) విత్తమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

భగవద్గీత – విష్ణుసహస్రనామములను గానము చేయుము. ఎల్లప్పుడు విష్ణువును ధ్యానించుము. మనస్సును సత్పురుషుల సాంగత్యమునందుంచుము. దీనులకు దానం చేయుము.

భగవద్గీతను, విష్ణుసహస్రనామములను గానము చేయవలెను. భగవంతునియొక్క స్వరూపమును ఎల్లపుడు ధ్యానము చేయవలెను. సత్సాంగత్యమందు చిత్తమును ప్రవేశపెట్టవలెను. బీదలకు దాన ధర్మములను చేయవలెను.

ఈ శ్లోకమును సుమతాచార్యవారు చెప్పిరి.

29. సుఖతః క్రియతే రామాభోగః
పశ్చాద్ధన్త శరీరే రోగః।
యద్యపి లోకే మరణం శరణం
తదపి న ముంచతి పాపాచరణమ్।

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

స్త్రీ సంగమము సుఖముగా చేయవచ్చును. కానీ తరువాత రోగం వచ్చును. లోకంలో మరణమే శరణమని తెలిసినా మానవుడు పాపం చేయుట మానడు.

సుఖాపేక్షతో కామభోగముల ననుభవించుదురు. కాని తదుపరి శరీరము రోగ గ్రస్తమగుచున్నది. ప్రపంచమున చావు అనునది తథ్యమై యున్నప్పటికీ జనులు పాపా చరణమును వదలకయే యున్నారే. ఆహా! ఆశ్చర్యము!

ఈ శ్లోకము నుండి 32వ శ్లోకం వరకు శ్రీ శంకరాచార్యులవారు చెప్పిరి.

30. అర్థమనర్థం భావయ నిత్యం
నాస్తి తతః సుఖలేశః సత్యమ్।
పుత్రాదపి ధనభాజాం భీతిః
సర్వత్రైషా విహితా రీతిః॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ధనము అనర్థమని ఎల్లప్పుడు భావించుము. నిజంగా డబ్బు వలన సుఖం లేదు. ఇది సత్యము. ధనవంతుడు పుత్రుని నుండి కూడ భయపడును. ఇదే అంతటా ఉన్న రీతి.

ధనము అనర్థమును కలుగజేయుననియు, ఆధ్యాత్మిక ప్రయోజనము లేనిదనియు ఎల్లప్పుడు భావించుము. ఆ ధనమువలన కొంచెమైనను పారమార్థిక సుఖము లేదు. ఈ విషయము ముమ్మాటికిని సత్యము. ధనవంతులకు తమ పుత్రులవలనకూడ భయము కలుగుచుండును. ఈ పద్ధతి లోకమందంతటను ఒకే విధముగ నున్నది.

31. ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్య వివేకవిచారమ్।
జాప్యసమేత సమాధివిధానం
కుర్వవధానం మహదవధానమ్॥

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

ప్రాణాయామము - ప్రత్యాహారము - నిత్యానిత్య వస్తు వివేకము - జపంతో కలసిన సమాధి స్థితి - ఏకాగ్రత - వీటిని శ్రద్ధగా ఆచరించుము.

ప్రాణాయామము, ప్రత్యాహారము, నిత్యానిత్యవస్తు వివేకము, తత్త్వ విచారణ, మంత్ర జపము, గొప్ప ఏకాగ్రతతో కూడిన సమాధిస్థితి మున్నగు సాధనలను అవలంభించుము.

32. గురుచరణాంబుజనిర్భరభక్తః
సంసారాదచిరాద్భవ ముక్తః।
సేంద్రియమానస నియమాదేవం
ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్॥

Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే

గురువుగారి పాద పద్మములపై భక్తినుంచి తొందరగా సంసారమునుండి బయటపడుము. ఇంద్రియములను – మనస్సును నియమించినచో నీ హృదయం లో ఉన్న దేవుని చూడగలవు.

గురువు యొక్క పాద పద్మములందు మనస్సును నెలకొల్పి గురుభక్తి కలవాడై, సంసారబంధనము నుండి శీఘ్రముగ విముక్తుడవు కమ్ము. ఇంద్రియములను, మనస్సును నిగ్రహించుటచేత మాత్రమే నీ హృదయమందున్న ఆత్మరూప పరమేశ్వరుని, దేవదేవుని చూడగలవు.

33. మూఢః కశ్చన వైయాకరణో
డుకృఞ్ కరణాధ్యయన ధురీణః।
శ్రీమచ్ఛఙ్కర భగవచ్ఛిష్యైః
బోధిత ఆసీచ్ఛోదిత కరణైః॥

వ్యాకరణ నియమాలతో తనను తాను కోల్పోయి మూఢుడైన వ్యాకరణ కర్త, శంకర భగత్పాదులవారి బోధనలతో కడిగివేయబడ్డాడు.

ఆత్మజ్ఞానము లేనివాడును, " డుకృఞ్కరణే" అను వ్యాకరణ సూత్రమును వల్లెవేయుటయందు మాత్రము అగ్రేసరుడైన ఒకానొక వ్యాకరణ శాస్త్రజ్ఞుడు, శ్రీ శంకర భగవత్పాదుల చేతను, వారి శిష్యుల చేతను ఈ విధముగ బోధింపబడి, అంతః కరణమును శుద్ధపఱచుకొని తరించెను.

Kiron Type Institute

34. భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే
నామస్మరణా దన్యముపాయం।
నహి పశ్యామో భవతరణే॥

భజించు గోవిందుని! భజించు గోవిందుని! ఓ మూఢుడా గోవిందునినే భజించు. సంసార సాగరాన్ని దాటడానికి గోవింద నామస్మరణకి మించినది లేదు.

– – – = = = – – –

ఇతి శ్రీ శంకరాచార్య విరచిత "భజగోవిందం" సంపూర్ణమ్

– – – = = = – – –



కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



Kiron Type Institute
Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. -944 044 9650, 994 994 1430)

Kiron Type Institute
Kiron Type Institute